సాక్షి
గుంటూరు
VII
శనివారం ၊ 11 ၊ మే ၊ 2024



కారులో సభా ప్రాంగణానికి వస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అభివాదం చేస్తున్న ప్రజలు



సీఎం వైఎస్ జగన్ చిత్రపటంతో ఓ చిన్నారి ఆనందం



ఉదయం 10గంటలకు గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార సభకు తరలివచ్చిన అశేష జనసందోహంలో ఓ భాగం

# మంగళగిరి జనఝరి





మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, సీఎం జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన మహిళలు

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు పోటెత్తిన జనం
- కిక్కిరిసిన మంగళాద్రి రహదారులు

- మీ అమ్మాయి లావణ్యకు సీటిచ్చా గెలిపించండి
- మంగళగిరి ప్రజలను కోరిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- జై జగన్ నినాదాల హోరు

మంగళగిరి జనసంద్రంగా మారింది. నియోజకవర్గం నలుమూలల నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు తరలివచ్చారు. జై జగన్ నినాదాలతో మంగళగిరి కొండ దద్దరిల్లింది. గౌతమబుద్ధారోడ్డుతోపాటు పట్టణంలోని రోడ్లన్నీ కార్యకర్తలతో కిక్కిరిసిపోయాయి. వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. లక్ష్మీ నారసింహుని కటాక్షం కూడా లభించింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. పెత్తందారులపై పోరుకు మేమంతా సిద్ధం అంటూ మంగళగిరి ప్రజలు మద్దతు పలికారు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మంగళగిరి సిద్ధమేనా అని ప్రశ్నించినప్పుడు సభికుల నుంచి సిద్ధమే అంటూ అనూహ్య స్పందన వచ్చింది. అప్పటి వరకూ ఎండగా ఉన్నా ముఖ్యమంత్రి వచ్చేసరికి మబ్బులు పట్టి వాతావరణం చల్లబడింది. దీనిపై ముఖ్యమంత్రి కూడా స్పందిస్తూ దేవుడి దయతో ఈ రోజు వాతావరణం కూడా చల్లగా ఉందన్నారు. పేదల భవిష్యత్ మారాలి, పేదల తలరాతలు మారాలి. అలా మారాలంటే మీ బిడ్డ వేస్తున్న అడుగులు ఎంత ముఖ్యమో.. ఈ అడుగులు వేయడం ఎంత అవసరమో ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి కోరారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా, గతంలో చూడని విధంగా నా అక్కచెల్లెమ్మలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడాలని, నా అక్కచెల్లెమ్మలకు ఏదో ఒక ఆదాయం వాళ్లకు రావాలి...అక్కచెల్లెమ్మల కోసం ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, అక్కచెల్లెమ్మల పేరిటే ఏకంగా 31 లక్షల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ అందులో కడుతున్నవి 22 లక్షల ఇళ్లు.. అక్కచెల్లెమ్మల బాగు కోసం ఇంతగా తపించిన ప్రభుత్వం, ఇన్ని పథకాలు పెట్టిన ప్రభుత్వం గతంలో ఎప్పుడైనా ఉందా? అక్కా జరిగిందా? చెల్లెమ్మా ఎప్పుడైనా జరిగిందా? పెద్దమ్మా జరిగిందా? అని ప్రశ్నించినప్పుడు మహిళల నుంచి మంచి స్పందన వచ్చింది. 2014లో చంద్రబాబునాయుడు మేనిఫెస్టో పేరుతో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని, ఒక్కో హామీని ప్రస్తావిస్తూ ఇలాంటి వాళ్లను నమ్మొచ్చా? అన్నా నమ్మొచ్చా? చెల్లి నమ్మొచ్చా? అని అడిగినప్పుడు నమ్మం అంటూ సమాధానమిచ్చారు. జగన్‌కు ఎక్కడ ప్రజల్లో మంచి పేరు వస్తుందోనని, ఈర్ష్య పడి అవ్వాతాతలకు మొన్నటి వరకు ఇంటికే వచ్చే పెన్షన్ కూడా రాకుండా చేసిన దౌర్భాగ్యులు వీరు. ఎన్నికల కోడ్ వంకతో పాత పథకాలకు కూడా డబ్బులు వేయనీయకుండా తెలుగుదేశం, కూటమి నేతలు అడ్డు పడుతున్నారని ముఖ్యమంత్రి ప్రజలకు వివరించారు.



వైఎస్సార్ సీపీ ప్రచార గొడుగులతో యువకులు



కేరింతలు కొడుతున్న యువతులు

## పథకాలన్నీ కొనసాగాలంటే... ఫ్యాన్‌కే ఓటు వేయాలి

వలంటీర్లు మరలా ఇంటికే రావాలన్నా, అవ్వాతాతల పెన్షన్ మళ్లీ ఇంటికే రావాలన్నా... బటన్లు నొక్కిన పథకాల సొమ్ము మళ్లీ నా అక్కచెల్లెమ్మల ఖాతాలకి రావాలన్నా.. పథకాలన్నీ కొనసాగాలన్నా.. లంచాలు, వివక్ష లేని పాలన కొనసాగాలన్నా.. పేదల భవిష్యత్, పేదల తలరాతలు మారాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా, మన వ్యవసాయం, మన వైద్యం మెరుగుపడాలన్నా... ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కాలి. ఫ్యాను గుర్తు మీద రెండు బటన్లు నొక్కి 175కి 175 ఎమ్మెల్యే స్థానాలు, 25కి 25 ఎంపీ స్థానాలు ఒక్కటి కూడా తగ్గేందుకే వీలు లేదు. సిద్ధమా? అని ప్రశ్నించారు.

## లావణ్యమ్మ మీలో ఒకరు

- నా చెల్లి లావణ్యమ్మను పరిచయం చేస్తున్నాను. లావణ్యమ్మ మీలో ఒకరు. మంగళగిరి సీటు బీసీలది. వెనుకబడిన వర్గాలది. అలాంటి సీటు గతంలో నేను ఆర్కేకు ఇచ్చాను. ఆర్కేతో నేను ఈ సారి మనం సీటు త్యాగం చేయాలి, ఇక్కడ నుంచి మనం బీసీలను తీసుకుని రావాలని.. ఆర్కేకు ఉన్న సీటు బీసీలకు ఇస్తే.. అక్కడ వాళ్లేం చేస్తున్నారు. బీసీల సీటు కదా.. గెలవడం సులభం అని.. ఏకంగా పెద్దపెద్దవాళ్లు అంతా వచ్చి డబ్బులు మూటలు తీసి ఎన్నికల్లో గెలవడానికి ప్రయత్నిస్తున్నారు అని ముఖ్యమంత్రి అన్నారు.
- ఎంపీ అభ్యర్థి రోశయ్యపైన కూడా మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు ఉంచాలని సవినయంగా మీ బిడ్డ రెండు చేతులు జోడించి పేరు, పేరునా ప్రార్థిస్తున్నాడు అంటూ ప్రసంగం ముగించారు. సభ ముగిసే వరకూ ప్రజలు ఆసక్తిగా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని విన్నారు.

# నేడు చిలకలూరిపేటకు సీఎం వైఎస్ జగన్

- ఉదయం 10 గంటలకు బహిరంగసభ
- జననేత రానుండడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్
- భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేసిన పోలీసు ఉన్నతాధికారులు

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట రానున్నారు. పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే బహిరంగసభలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలనుద్దేశించి సీఎం ప్రసంగిస్తారు. జిల్లాలో క్రోసూరు, మాచర్ల సభలు విజయవంతమైన రీతిలోనే చిలకలూరిపేట సభను సక్సెస్ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ప్రచారం చివరి రోజు సీఎం జిల్లాకు రానుండటంతో అభిమానుల్లో జోష్ పెరిగింది.



బహిరంగసభ జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ బింధుమాదవ్

**ఏర్పాట్లను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నేతలు**

వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగసభ ఏర్పాట్లను ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడులు శుక్రవారం పరిశీలించారు. చీరాల రోడ్డులో కక్కెర దాసయ్య గోడౌన్స్ వద్ద ఏర్పాటు చేసిన సీఎం హెలిప్యాడ్‌ను పరిశీలించారు. తరువాత కళామందిర్ సెంటర్ వద్ద బహిరంగసభ జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు.

**భద్రత కట్టుదిట్టం**

సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ బింధుమాదవ్ సీఎం హెలిప్యాడ్ ఏర్పాటుచేసిన గ్రౌండ్, బహిరంగ సభ జరిగే ప్రాంతాలను పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాటు తదితర విషయాలపై సూచనలు చేశారు. సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గంలో పటిష్ట బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేయనున్నారు. మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా భారీ భవంతులను ఇప్పటికే పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని పర్యవేక్షిస్తున్నారు.

## క్లుప్తంగా

### 13న వేతనంతో కూడిన సెలవు మంజూరు

లక్ష్మీపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 13వ తేదీ ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేసినట్లు గుంటూరు జోన్ సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాస్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, హోటళ్లు, సినిమా హాల్స్, వాణిజ్య సంస్థల్లో పనిచేసే వారికి వర్తిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, సంస్థల చట్టం 1988 సెక్షన్ 2(31) అధికారాలను వినియోగించుకుని, ఫ్యాక్టరీలు, కర్మాగాల్లో పనిచేసే కార్మికులకు జీఓ ఆర్టీ నంబరు 278 ప్రకారం 2024 ఏప్రిల్ 25 అనుసరించి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు సందర్భంగా కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయడ జరిగిందని వెల్లడించారు. కార్మికులు, యజమానులకు ఏమైనా సమస్యలు ఉంటే సెల్ 9492555145లో సంప్రదించాలని సూచించారు.

### బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీని ఓడిస్తాం



నెహ్రూనగర్: బీజేపీకి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని, బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన అభ్యర్థులను ఓడించాలని మాల ఐక్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్‌బాబు తెలిపారు. శుక్రవారం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన కూటమికి అధికారం ఇస్తే మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరిగిన ఘటనలే రాష్ట్రంలో కూడా చోటుచేసుకునే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది మాలలు తమ స్వార్థం కోసం టీడీపీకి మద్దతుగా సమావేశాలు పెట్టి టీడీపీకి ఓట్లు వేయాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర యువజన విభాగం ప్రెసిడెంట్ యామర్తి ఇమ్మానియేల్‌రాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు జీ అచ్చయ్య, రాయపూడి మరియదాసు పాల్గొన్నారు.

### నేటి నుంచి మిర్చి యార్డుకు వేసవి సెలవులు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శనివారం(నేటి) నుంచి జూన్ 9వ తేదీ వరకు వేసవి సెలవులు అని మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్, యార్డు ఇన్‌చార్జి ఉన్నత శ్రేణి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డులోని మిర్చి దిగుమతి, ఎగుమతి షాపుల కార్మిక సంఘాలు, దిగుమతి వ్యాపారుల సంఘం అభ్యర్థన మేరకు ప్రస్తుత వేసవి సీజన్‌లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వేసవి సెలవులు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. రైతులు సెలవు రోజుల్లో తమ సరుకును తీసుకురావద్దని సూచించారు. జూన్ 10వ తేదీ నుంచి యార్డులో యథావిధిగా క్రయ, విక్రయాలు జరుగుతాయన్నారు. జూన్ 9వ తేదీ అర్ధరాత్రి నుంచి యార్డుకు యథావిధిగా రైతులు తమ సరుకును తీసుకు రావచ్చని ఆయన తెలిపారు.

# నేటితో ఎన్నికల ప్రచారానికి తెర

- ఆరు గంటలకు సమాప్తం
- మూగబోనున్న మైకులు
- ప్రచారానికి వచ్చిన ఇతర ప్రాంతాల నేతలు నియోజకవర్గం దాటి వెళ్లాల్సిందే
- ప్రలోభాలకు తెరలేపిన కూటమి అభ్యర్థులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: మైకులు శనివారం సాయంత్రం నుంచి మూగబోనున్నాయి. కొన్ని రోజులుగా ఎన్నికల ప్రచారంతో అట్టుడికిన పల్లెలు, పట్టణాల్లో ప్రచారానికి తెరపడనుంది. వచ్చే సోమవారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటింగ్ ముగింపు సమయానికి 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాల్సి ఉంది. ఈ కొద్ది గంటల సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ర్యాలీలతో హోరెత్తించేందుకు పార్టీలు సన్నద్ధం అయ్యాయి. ఇప్పటికే నియోజకవర్గాల్లో ఆయా పార్టీల నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు మొదలు పెట్టారు. గ్రామాల్లో ఎక్కడికక్కడ ఓటుకు నోటు ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తెలుగుదేశం నేతలు భారీగా డబ్బు పంచడానికి రంగం సిద్ధం చేశారు. శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. మరోవైపు ఎన్నికల్లో మద్యం, నగదు పంపిణీని అడ్డుకునేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. అందుకోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఆయా పార్టీలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే ఊరూవాడా అనే తేడా లేకుండా ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ర్యాలీలు, రోడ్‌షోలు, సమావేశాలు నిర్వహించారు. పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నేటి సాయంత్రం నుంచి పోలింగ్ రోజు వరకు జిల్లాలో మద్యం దుకాణాలు మూసి ఉంటాయి. దీంతో ముందస్తు వ్యూహంతో టీడీపీ నేతలు భారీ స్థాయిలో మద్యం నిల్వలు సమకూర్చుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మద్యం, డబ్బు ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి ఎన్నికల అధికారులు, పోలీస్ యంత్రాంగం పటిష్ట నిఘా ఉంచినా యంత్రాంగం కళ్లుగప్పి తమ పని తాము చేసుకుపోవడానికి అభ్యర్థులు రెడీ అవుతున్నట్లు సమాచారం. సమయం తక్కువగా ఉండటంతో ఈ కాస్త సమయాన్ని చాలా విలువైందిగా అభ్యర్థులు భావిస్తున్నారు. ఓటర్ దేవుళ్లను ప్రసన్నం చేసుకోవటానికి వీలున్న అన్ని మార్గాల్లో పార్టీలు, అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు ప్రచారం కోసం వచ్చిన బయటి నాయకులు సాయంత్రానికల్లా నియోజకవర్గం విడిచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. బూత్ కమిటీలతో సమీక్షలు, పోలింగ్ ఏజెంట్ల నియామకాలపై ఆయా పార్టీలు దృష్టి పెట్టాయి. చివరి రోజున ఇంటింటి ప్రచారంపై దృష్టి పెట్టాయి.

## ఎన్నికల నిర్వహణలో పోలీసు పాత్ర ఎంతో కీలకం

- పారదర్శకంగా విధులు నిర్వహించాలి
- రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా

గుంటూరు వెస్ట్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ తుషార్ డూడీ, గుంటూరు పార్లమెంట్ పోలీస్ అబ్జర్వర్ సత్యార్థ అనిరుధ్ పంకజ్, వ్యయ పరిశీలకులు మృణాల్ కుమార్ దాస్‌తో కలసి సమావేశం నిర్వహించారు. దీపక్ మిశ్రా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడే ఉండాలని చెప్పారు. భవిష్యత్ తరాల బంగారు భవిత కోసం జరుగుతున్న ఈ ఎన్నికల్లో జిల్లా యంత్రాంగంతో పాటు పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ముఖ్యంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాలతోపాటు లోపలికి, బయటకు వెళ్లేవారిపై సీసీ కెమెరాలతో పహారా నిర్వహించాలన్నారు. బైండోవర్ చేయించిన వ్యక్తులతో ఉదయాన్నే ఓటు వేయించి, తిరిగి స్టేషన్‌కు తీసుకొచ్చి పోలింగ్ ముగిసే వరకు ఉంచాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలు వాహనాల్లో స్ట్రాంగ్ రూమ్‌కు చేరే వరకు పైలెట్ వాహనానికి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇబ్బందులు కలిగించినా, సంఘ విద్రోహక చర్యలకు పాల్పడినా కఠినంగా అణచివేయాలని దీపక్ మిశ్రా ఆదేశించారు.



మాట్లాడుతున్న దీపక్ మిశ్రా

**69 శాతం పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్..**

సమావేశంలో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 17,91,543 మంది ఓటర్లున్నారన్నారు. వీరి కోసం 1915 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. వీటిలో 372 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. 69 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసామని తెలిపారు.

ఎన్నికల వ్యవహారాలు పర్యవేక్షించేందుకు 17 బృందాలకు నోడల్ అధికారులను ఏర్పాటు చేశామని చెప్పారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎటువంటి ఇబ్బందులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ వివరించారు. ఎన్నికల ఏర్పాట్లను దీపక్ మిశ్రాకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ట్రైనీ ఎస్పీ మనోజ్ హెగ్డే, అడిషనల్ ఎస్పీలు కె.శ్రీనివాసరావు, జి.రమణ మూర్తి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీకే ముస్లిం మైనారిటీల మద్దతు



లక్ష్మీపురం: ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ముస్లిం మైనారిటీల మద్దతు వైఎస్సార్ సీపీకేనని జమియతుల్ ఉలేమా, ముస్లిం సంఘాల నాయకులు తీర్మానించినట్లు ఆంధ్ర రాష్ట్ర జమియతుల్ ఉలేమా పెద్దలు ముఫ్తీ బాసీత్ తెలిపారు. స్థానిక గాంధీపార్క్ వద్ద ఉన్న ఓ మండపంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా ముస్లిం సమాజంపై వ్యతిరేకంగా ఉన్న బీజేపీ, ఆ పార్టీకి మద్దతుగా నిలిచిన తెలుగుదేశం, జనసేన పార్టీ కూటమిలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 4శాతం రిజర్వేషన్‌ను రద్దు చేస్తామంటూ ఒక వైపు బహిరంగ సభలో బీజేపీ నాయకులు స్వయాన దేశ ప్రధాని, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ముస్లింలకు అండగా ఉన్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. మౌలానా ఇస్మాయిల్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపి ప్రవేశ పెట్టే యత్నంచేస్తున్న నల్లచట్టాలను రాష్ట్రంలో అమలు కాకుండా అండగా నిలుస్తానని నెల్లూరు సభలో బహిరంగంగా సీఎం జగన్ భరోసా ఇవ్వడంతో ముస్లిం సమాజ పక్షపాతిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో హాఫీజ్ సయ్యద్ ఆరిఫ్, మౌలానా మునవ్వర్ ముఫ్తీ అబ్దుల్ కవి పాల్గొన్నారు.

## ఓటర్ల కోసం 1026 వీల్ చైర్లు సిద్ధం

నరసరావుపేట: సాధారణ ఎన్నికల్లో భాగంగా పీడబ్ల్యూడీ (పర్సన్ విత్ డిజయబులిటీ) ఓటర్ల సౌకర్యార్థం జిల్లాలో 1026 వీల్ చైర్స్‌ను అందుబాటులో ఉంచినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో నియోజకవర్గానికి సంబంధించి వీల్‌చైర్ల పంపిణీ ప్రారంభించారు. ఏ పోలింగ్ స్టేషన్లో అవసరం ఉంటుందో ఆ పోలింగ్ స్టేషన్లో అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, పీడబ్ల్యూడీ ఓటర్ల నోడల్ అధికారి సునీత, స్వీప్ నోడల్ అధికారి నాగిని, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వీ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.




ఎస్ఎస్ఎన్ కళాశాలలో వీల్‌చైర్ల పంపిణీ ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

## చంద్రబాబు, లోకేష్‌లకు ఓటు అడిగే హక్కు లేదు

- రెండోసారి లోకేష్‌కు పరాభవం తప్పదు
- డబ్బు సంచులతో గెలవలేరు.. లావణ్యను గెలిపించాలి
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)





మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: చంద్రబాబు, లోకేష్‌లకు ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. పట్టణంలోని గౌతమ బుద్ధా రోడ్డులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ డబ్బు సంచులతో గెలవాలని చూసినా సాధ్యం కాదని గుర్తించుకోవాలని హితవు పలికారు. మంగళగిరి బీసీ సీటు అని అందుకే అన్ని వర్గాలకు చట్టసభలలో ప్రాధాన్యం కల్పించాలని సీఎం జగనన్న బీసీ మహిళకు సీటు కేటాయిస్తే పేదలపై డబ్బు సంచులతో గెలవచ్చనే ఉద్దేశంతో లోకేష్ పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఇది పెత్తందార్లకు పేదలకు జరిగే యుద్ధంలో పేదలదే విజయమని స్పష్టం చేశారు. పెత్తందారులు ఇచ్చే డబ్బులు తీసుకోవాలని అది మన పేదల డబ్బేనన్నారు. బీసీ మహిళ లావణ్యకు నియోజకవర్గ ప్రజలంతా అండగా నిలవాలని ఆకాంక్షించారు. సభకు భారీగా తరలివచ్చిన జనంతోనే లావణ్య విజయం తథ్యమని చెప్పారు.

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారు రోశయ్య మాట్లాడుతూ లోకేష్, పెమ్మసానిలు గెలిస్తే ఒకరు హైదరాబాద్‌కు, ఒకరు అమెరికాకు వెళ్తారని, వారిని కలవాలంటే ప్రజలు వీసాలు పాస్‌పోర్టులు తీసుకోవాలా అని నిలదీశారు. పెమ్మసాని అమెరికా నుంచి వందల కోట్లు తీసుకువచ్చి అహంకారంతో మాట్లాడుతున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య మాట్లాడుతూ సమ సమాజ సంస్కర్త సీఎం జగనన్న అని అన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, మహిళా నాయకురాలు నంబె సునీత, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పారేపల్లి విజయలక్ష్మి, మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పట్టణ, రూరల్ కన్వీనర్లు ఆకురాతి రాజేష్, మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బుర్రముక్కు వేణుగోపాల్‌రెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, దుగ్గుడి సలహాదారు జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఈదులమూడి డేవిడ్ రాజు, దాసరి వీరయ్య, ఈపూరి ఆదామ్, మాజీ ఎంపీపీ పచ్చల రత్నకుమారి, రాష్ట్ర మహిళా కార్యదర్శి పాలేటి కృష్ణవేణి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మల్లవరపు సుధారాణి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఏడాది ప్రోత్సాహకాలు

- కొత్త పారిశ్రామిక విధానానికి అనుగుణంగా మేనిఫెస్టో
- జగనన్న తోడు రుణపరిమితి పెంపు
- రోడ్ల మరమ్మతులు, అభివృద్ధిపై వచ్చే ఐదేళ్లలో ప్రత్యేక శ్రద్ధ
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

పట్నంబజారు: ఎంఎస్ఎంఈలకు ఇప్పటికే రెండుసార్లు ప్రోత్సాహకాలు ఇచ్చామని, ఇకపై ప్రతి ఏడాది ఇచ్చేలా మ్యానిఫెస్టోలో ఇప్పటికే ప్రకటించామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. స్థానిక శ్యామలానగర్‌లోని రెండో లైనులో ఉన్న మంత్రి విడదల రజిని నివాసానికి శుక్రవారం 120 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు చేరుకుని వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ కొత్త పారిశ్రామిక విధానానికి శ్రీకారం చుట్టేలా కీలకమైన అంశాలు ప్రస్తుతం ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లు చెప్పారు. మాట ఇస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తప్పకుండా నెరవేరుస్తారని పేర్కొన్నారు. ప్రజలందరి మద్దతు వైఎస్సార్ సీపీకే ఉందని చెప్పారు. మరోసారి తాము అద్భుతమైన మేనిఫెస్టోను ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి జిల్లాలో పీపీపీ పద్ధతిలో ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధికి అడుగులు వేసేలా నూతన ప్రభుత్వం ఉంటుందని వివరించారు. జగనన్న తోడు ద్వారా రుణపరిమితిని రూ.15వేలకు పెంచుతూ మేనిఫెస్టో ప్రకటించామన్నారు. వైఎస్సార్ వాహన మిత్ర, జగనన్న చేదోడు, వైఎస్సార్ మత్స్యకార భరోసా, వైఎస్సార్ లా నేస్తం, వైఎస్సార్ నేతన్న నేస్తం ఇలా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేసిన గొప్ప నాయకుడు జగన్ మోహన్ రెడ్డి అని చెప్పారు. వచ్చే ఐదేళ్లు కూడా ఈ పథకాలన్నీ కొనసాగుతాయని వెల్లడించారు. అందుకే ప్రజలంతా జగనన్న మరోసారి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అన్ని పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి వచ్చి చేరుతున్నారని చెప్పారు.

**జగనన్నకు మద్దతుగా ప్రజలు సిద్ధం**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పశ్చిమ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా ఏకంగా రూ.5 లక్షల కోట్ల లబ్ధి చేకూర్చిన నాయకుడు వైఎస్ జగన్ ఒక్కరే ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీ అర్బన్ విభాగం మాజీ అధ్యక్షుడు మొహిద్దీన్ కుమారుడు ఎస్ఎం జాన్ ఆలీ, షేక్ షరీఫ్ ఉమర్ భాష, రబ్బానీ, షౌకత్, సుభాని, రఫీ మక్బూల్ పార్టీలో చేరారు.



# సంఘ వ్యతిరేక శక్తులుగా పోలీసులు

టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని



మాట్లాడుతున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని

ప్రత్తిపాడు: పోలీసులు సంఘ వ్యతిరేక శక్తులంటూ టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, జనసేన, బీజేపీ నాయకులతో కలసి శుక్రవారం సాయంత్రం రోడ్ షో నిర్వహించారు. నడింపాలెం రోడ్‌షోలో పెమ్మసాని మాట్లాడుతూ పోలీసులు ప్రజలను కాపాడాల్సింది పోయి వాళ్లే సంఘ వ్యతిరేక శక్తులుగా మారారన్నారు. కొంత మంది అధికారులను అయితే బానిసలుగా మార్చారని విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైతే వాళ్లు చేయనటువంటి పని లేదని, వాళ్లందరూ ఈ రోజు బంధీలుగా ఉన్నారని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు.


**వన్ సైడెడ్‌గా ఓటు వేస్తామన్న ఉద్యోగులు..**

ఉద్యోగస్తులను బిచ్చగాళ్లగా చేశారని, వాళ్లకు ఒకటో తారీకు జీతం వస్తుందో రాదో తెలియని పరిస్థితి ఉందన్నారు. 'నిన్న నా దగ్గరకు కొంత మంది ఉద్యోగులు వచ్చారు.. సార్ మాకు ఒకే ఒక్క హామీ ఇవ్వండి.. మా ఉద్యోగులు మొత్తం కూడా మీకు వన్ సైడ్ ఓటు వేస్తామని. ఈ మెడికల్ వాళ్లు ఏమడుగుతారో అనుకుంటే ఒకటో తారీఖు మాకు వచ్చే శాలరీ ఇస్తే చాలని చెప్పారన్నారు.

**మోదీ, అమిత్‌షాలపై పరోక్ష వ్యాఖ్యలు..**

నాలుగు శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని, లేకపోతే సీఏఏ బిల్లుపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఫోర్ పర్సంట్ బిల్లు మీద న్యాయస్థానంలో పోరాటం చేస్తున్నటు వంటి న్యాయమూర్తులకు(న్యాయవాదుల గురించి) ఫీజు పే చేస్తుంది చంద్రబాబు నాయుడని గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రోడ్‌షోలో మాట్లాడుతూ మీరు ఒక్కటే గుర్తు పెట్టుకోండి. రాష్ట్రానికి ఏ వ్యక్తి వచ్చి ముస్లింలకు అన్యాయం చేసేటువంటి పరిస్థితి ఉండదని, ఎందుకంటే అది రావాలంటే ఫస్ట్ రామాంజనేయులును దాటుకుని రావాలని, తరువాత పెమ్మసానిని దాటుకుని వెళ్లాలి, తరువాత చంద్రబాబునాయుడుని దాటుకుని వెళ్లాలని చెప్పారు. ఎవ్వడిక్కడకు వచ్చి రాష్ట్రంలో కాలు పెట్టేటువంటి పరిస్థితి ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలను ఉద్దేశించి పరోక్షంగా చెప్పారు. వాళ్లు చెప్పేవి విని ఎటువంటి అపోహాలు పెట్టుకోవద్దని, కేవలం మేం పొత్తు పెట్టుకున్నది మీ పిల్లలకు ఉద్యోగాలు తీసుకు రావడం కోసం, రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా తప్పించి వేరే ఆలోచన లేదన్నారు. మీ హక్కులకు గానీ స్వేచ్ఛకు గానీ భంగం కలిగినప్పుడు, అవసరమైతే ఈ ఎంపీ పదవికి రాజీనామా చేసేందుకు ఒక్క క్షణం కూడా ఆలోచించనని పెమ్మసాని చెప్పారు. మీ జీవితం గతంలో ఉన్న విధంగానే ఇకపై కూడా ఉంటుందని, నన్ను ఎవ్వడూ టచ్ చేయలేడని చెప్పారు.

## తెనాలి చేరుకున్న గిరిజన రాజకీయ చైతన్యయాత్ర



తెనాలి: వైఎస్సార్ సీపీకి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న గిరిజన రాజకీయ చైతన్యయాత్ర శుక్రవారం తెనాలి చేరింది. గిరిజన సంఘాల నేతలు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌ను కలిశారు. ఎన్నికల ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరింపజేశారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, ఆంధ్రప్రదేశ్ ఎరుకల ప్రజాసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు, ఆంధ్రప్రదేశ్ యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడమల రామచంద్రయ్య ప్రచారయాత్ర గురించి వివరించారు. గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గిరిజనుల అభివృద్ధికి, పిల్లల భవిష్యత్‌కు ఎంతగానో ప్రయోజనకరమని చెప్పారు. చంద్రబాబు అబద్ధపు వాగ్దానాలు, మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని అని గిరిజనులకు హితవు పలికారు. గిరిజనులకు అండగా ఉన్న జగన్ మోహనరెడ్డిని మళ్లీ సీఎంగా ఎన్నుకోవాలని కోరారు. అందుకోసం తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్యను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సూచించారు. వీరితో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి తోకల చిన్నవిరోజి, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేసనం హేమంత్, ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిడి.గజేంద్రరావు ఉన్నారు.

# గుంటూరు మాదే

**ధీమా వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ**
- ఏడు సీట్లలోనూ విజయావకాశాలు
- డబ్బుతో రాజకీయం చేస్తున్న తెలుగుదేశం
- కోట్లు ధారబోసి ఓట్లు కొనుగోళ్లకు సిద్ధం
- అయినా పట్టించుకోని ఓటర్లు

గుంటూరు జిల్లాలో మరోసారి విజయకేతనం ఎగురవేసే దిశగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తోంది. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైన గుంటూరు వెస్ట్‌ను కూడా ఈసారి తన ఖాతాలో వేసుకునే దిశగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముందుకు కదులుతున్నారు. రాజకీయ చైతన్యం కలిగిన గుంటూరు జిల్లా ఓటరు ఈసారి కూడా సంక్షేమం, అభివృద్ధికే ఓటు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తమ గెలుపు నల్లేరుపై నడకేనని వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులు భావిస్తున్నారు.

–సాక్షి ప్రతినిధి, గుంటూరు

## పక్కా లోకల్ నినాదంతో కిలారి



గుంటూరు పార్లమెంట్‌కు తెలుగుదేశం పార్టీ బయట నేతలను రంగంలోకి దింపుతోంది. 2014, 2019లో చిత్తూరు జిల్లాకు చెందిన గల్లా జయదేవ్‌ను పోటీలోకి దింపగా ఈసారి వేల కోట్ల ఆస్తులున్న ఎన్ఆర్ఐ పెమ్మసాని చంద్రశేఖర్‌ను బరిలోకి దింపింది. ఆయన కోట్లు వెదజల్లి గెలుపుకోసం ప్రయాస పడుతున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ తరపున పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్యను బరిలోకి దింపింది.పొన్నూరును గత ఐదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేసిన కిలారు రోశయ్యకు ఎంపీగా ప్రమోషన్ ఇచ్చింది. పక్కా లోకల్ అనే నినాదంతో ఆయన ముందుకు వెళ్తున్నారు.

## మొదటిసారిగా పోటీలో మైనారిటీ మహిళ



గుంటూరు తూర్పులో వైఎస్సార్‌సీపీ మొదటిసారిగా మైనారిటీ మహిళ నూరీ ఫాతిమాకు సీటు ఇచ్చింది. గత రెండు దఫాలుగా ఇక్కడ వైఎస్సార్‌సీపీ గెలుస్తూ వస్తోంది. మహ్మద్ ముస్తఫా 2014, 2019లో గెలుపొంది నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. గత పాలనలో అడ్డగోలుగా తవ్వేసిన రోడ్లు, డ్రైన్లు మరమ్మతులు చేయడమే కాకుండా చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న పలురోడ్లు విస్తరించి వాటిని సుందరంగా తీర్చిదిద్దారు. మూలపడిన గాంధీ పార్కును పునరుద్ధరించారు. ఈ దఫా ఆయన కుమార్తెను తన వారసురాలిగా రంగంలోకి దింపారు. తెలుగుదేశం పార్టీ తరపున మహ్మద్ నసీర్ బరిలో ఉన్నారు.

## రజిని విజయం నల్లేరుపై నడకే



గుంటూరు పశ్చిమంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసే దిశగా అడుగులు పడుతున్నాయి. 2014, 2019లో ఇక్కడ తెలుగుదేశం పార్టీ గెలిచింది. 2019లో ఇక్కడి నుంచి గెలిచిన మద్దాళి గిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. నియోజక వర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. ఈ దఫా ఇక్కడ చిలకలూరిపేట నుంచి గెలిచి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న విడదల రజినిని పోటీలో నిలబెట్టారు. ఆమె గత నాలుగు నెలలుగా విస్తృతంగా ప్రచారం చేస్తూ తన గెలుపు నల్లేరుపై నడకలా మార్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కోసం గాలించి చివరికి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న గల్లా మాధవికి సీటు ఇచ్చింది.

## బీసీల బలంతో లావణ్య ముందుకు



మంగళగిరినుంచి తెలుగుదేశం పార్టీ తరపున చంద్రబాబునాయుడు కుమారుడు, మాజీ మంత్రి నారా లోకేష్ మరోసారి అదృష్టాన్ని పరిశీలించుకోవాలని భావిస్తున్నారు. దీని కోసం భారీగా ఖర్చు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) స్థానంలో బీసీ వర్గానికి చెందిన మురుగుడు లావణ్యకు సీటు ఇచ్చింది. అమె తల్లి కాండ్రు కమల, మామ మురుగుడు హనుమంతరావు గతంలో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. మురుగుడు హనుమంతరావు ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఇక్కడ బీసీలు ఎక్కువగా ఉండటంతో సిట్టింగ్‌ను సైతం పక్కన పెట్టి బీసీ మహిళకు సీటు కేటాయించారు.

## సులువుగా గెలుపు సుచరితదే



రాజధాని ప్రాంతమైన తాడికొండలో మరోసారి గెలుపుగుర్రం ఎక్కాలని వైఎస్సార్‌సీపీ గట్టిగా ప్రయత్నాలు చేస్తోంది. ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే తాడికొండ శ్రీదేవి తెలుగుదేశం ఇచ్చిన డబ్బుకు అమ్ముడుపోయి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి మద్దతు ప్రకటించి, తర్వాత తెలుగుదేశం పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. దీంతో ఇక్కడి నుంచి మాజీ హోం మంత్రి మేకతోటి సుచరితను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపింది. ఆమె సొంత నియోజకవర్గం కావడంతో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. తెలుగుదేశం పార్టీ తరపున మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ మరోసారి బరిలోకి దిగారు.

## పొన్నూరులో అంబటి గెలుపు ఖాయం



పొన్నూరు నియోజకవర్గంలో మరోసారి గెలుపుదిశగా వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన కిలారి రోశయ్యను ఈసారి ఎంపీగా పంపడంతో అంబటి మురళీకృష్ణను బరిలోకి దింపింది. ఆయన గత కొన్నేళ్లుగా పొన్నూరులో భజరంగ్ ఫౌండేషన్ ద్వారా పలుసేవా కార్యక్రమాలతో ప్రజలతో మమేకం అయ్యారు. గత ఐదేళ్లలో పొన్నూరులో అనూహ్యంగా అభివృద్ధి చేయడంతో మరోసారి కూడా వైఎస్సార్‌సీపీకి ప్రజలు మద్దతుగా ఉన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన నరేంద్ర ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నారు. ఈసారి కూడా ప్రజల నుంచి ఆయనకు మద్దతు లభించడం లేదు.

## అభివృద్ధి మంత్రంతో అన్నాబత్తుని శివకుమార్



తెనాలి నియోజకవర్గం పొత్తులో భాగంగా జనసేనకు దక్కింది. ఇక్కడి నుంచి మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ బరిలోకి దిగారు. ఇక్కడ మొదటి నుంచి సీటు ఆశించిన మాజీ మంత్రి ఆలపాటి రాజాకు సీటు దక్కకపోవడంతో ఆయన వర్గం మనస్ఫూర్తిగా పనిచేయడం లేదు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కే మరోసారి సీటు కేటాయించింది. గత ఐదేళ్లలో తెనాలిని అభివృద్ధి పట్టాలు ఎక్కించిన శివకుమార్ వైపే తెనాలి ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

## ప్రత్తిపాడులో కొత్త అభ్యర్థుల మధ్య పోరు



ప్రత్తిపాడులో కొత్త అభ్యర్థుల మధ్య పోరు జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ తరపున గెలిచి హోం మంత్రిగా పనిచేసిన మేకతోటి సుచరిత ప్రస్తుతం తాడికొండ బరిలో దిగడంతో ఇక్కడ బలసాని కిరణ్‌కుమార్‌ను బరిలోకి దింపింది. ఆయన ప్రచారంతో దూసుకుపోతున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున మాజీ ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులును పోటీలోకి దింపింది. తెలుగుదేశంపార్టీలో గ్రూపులు ఉండటం, వారి మధ్య సమన్వయం లేకపోవడం వల్ల సొంత పార్టీ నుంచే మద్దతు దొరకడం లేదు.


## మైనారిటీలకు మెరుగైన చదువులు

పేద విద్యార్థులకు ఉచితంగా చదువులు చెప్పించడమనేది ప్రభుత్వ బాధ్యత కాదని తన మనసులో మాటను స్పష్టంగా చెప్పిన చంద్రబాబు తన పాలనలో మైనారిటీల సంక్షేమంతో పాటు వారి భవిష్యత్తును సైతం గాలికొదిలేశారు. ముస్లిం, మైనారిటీలకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యను అందని ద్రాక్షగా మార్చారు. గత టీడీపీ పరిపాలనలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఉర్దూ మీడియం పాఠశాలలు ధీనావస్థలోకి నెట్టివేశారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పాఠశాలలు మళ్లీ అభివృద్ధి బాట పట్టాయి.

- విద్యార్థుల ఉజ్వల భవితపై వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టి
- ఐదేళ్ల టీడీపీ పాలనలో ఉర్దూ పాఠశాలలకు మొండిచెయ్యి
- సీఎం వైఎస్ జగన్ పాలనలో క్రమం తప్పకుండా పాఠ్య పుస్తకాల సరఫరా
- మిర్రర్ ఇమేజ్ టెక్నాలజీతో ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో పాఠ్యాంశాల ముద్రణ
- రెండు భాషల్లోనూ ప్రావీణ్యం పెంచుకుంటున్న విద్యార్థులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 224 పాఠశాలల్లో 12 వేల మంది విద్యార్థులు



ఉర్దూ పాఠ్య పుస్తకాలు (ఫైల్)



డ్యూయల్ లాంగ్వేజ్ విధానంలో ముద్రించిన ఉర్దూ పాఠ్య పుస్తకాలు (ఫైల్)

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలతో చదువులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. జగనన్న విద్యాకానుక స్టూడెంట్ కిట్ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్య పుస్తకాలతో విద్యార్థులు పాఠశాలలకు రెగ్యులర్‌గా హాజరవుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న ముస్లిం విద్యార్థులకు పాఠశాలలు తెరిచిన తరువాత నెలల తరబడి పాఠ్య పుస్తకాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులను పూర్తిగా మార్చి వేసిన జగనన్న ప్రభుత్వం గత ఐదేళ్లుగా ప్రతి ఏటా పుస్తకాలను సక్రమంగా పంపిణీ చేస్తోంది. పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థుల చేతుల్లోకి పుస్తకాలను ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలతో చదువుతున్న విద్యార్థులతో సమానంగా ఉర్దూ మీడియం విద్యార్థులకు మండలాల వారీగా పక్కాగా ఇండెంట్ తీసుకుని, నాణ్యమైన మెటీరియల్‌తో పాఠ్య పుస్తకాలను ముద్రించి పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు.




**డ్యూయల్ లాంగ్వేజ్ విధానంలో ఉర్దూ పాఠ్యపుస్తకాలు :** ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉచితంగా ఇస్తున్న పాఠ్య పుస్తకాలను డ్యూయల్ లాంగ్వేజ్ విధానంలోకి మార్చిన ప్రభుత్వం ఉర్దూతో పాటు ఆంగ్ల మాధ్యమంలోనూ పాఠ్యాంశాలను రూపకల్పన చేసింది. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో అమలు చేస్తున్న డ్యూయల్ లాంగ్వేజ్ విధానాన్ని ఉర్దూ మీడియంలోనూ ప్రవేశపెట్టిన ప్రభుత్వం రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) ద్వారా ఒకే పాఠ్య పుస్తకంలో ఒక వైపు ఆంగ్ల మాధ్యమం, ఉర్దూ మాధ్యమంలో పాఠ్యాంశాలను ముద్రించింది. తద్వారా ముస్లిం విద్యార్థులు ఒకేసారి తమ మాతృభాష అయిన ఉర్దూతో పాటు ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాలను చదువుకుని రెండు భాషల్లోనూ పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 224 పాఠశాలలు:** ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 224 ఉర్దూ పాఠశాలల్లో 12వేల మంది మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 181 ప్రాథమిక పాఠశాలల పరిధిలో ఆరువేలు, 38 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఐదు వేలు, ఐదు ఉన్నత పాఠశాలల్లో వెయ్యి మంది మంది చొప్పున విద్యార్థులు ఉన్నారు.




ముదిరాజుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, వేదికపై ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, ఏసురత్నం

# గెలిపించండి..అండగా ఉంటా

**నెహ్రూనగర్:** బీసీలకు ఏ రాజకీయ పార్టీ కూడా అంతగా ప్రాధాన్యత ఇచ్చిన దాఖలాలు చరిత్రలో లేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చి వారిని అక్కున చేర్చుకున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. ముదిరాజ్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు గూడూరి నానిముదిరాజ్ ఆధ్వర్యంలో చుట్టుగుంటలో ముదిరాజుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బీసీల పార్టీ అంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చెప్పుకునే విధంగా సీఎం వైఎస్ జగన్ బీసీలకు అన్ని మంచి కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు.మహామహులున్న గుంటూరు పశ్చిమలో తిరిగి నాకు స్థానం కల్పించారంటే బీసీలంటే జగనన్నకు ఎంత ప్రేమో అర్థం చేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో మీ ముదిరాజ్ బిడ్డనైన నన్ను గెలిపించాలని కోరారు. పేదలను మరింత వృద్ధిలోకి తీసుకురావాలని సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తుంటే వాటిని అడ్డుకునేందుకు పెత్తందారులు కుట్ర పన్నుతున్నాయని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో 139 బీసీ కులాలు ఉంటే వాటిని 56 కార్పొరేషన్లుగా విభజించి చైర్మన్లుగా నామినేటెడ్ పోస్టులు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఆనాడు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టి పేదలు చదువుకునేందుకు కృషి చేస్తే...ఈనాడు ఆయన తనయుడు వైఎస్ జగన్ నాలుగు అడుగులు ముందుకేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి పథకాలను అమలు చేస్తూ పేద విద్యార్థులు చదువుకునేందుకు బాటలు వేశారని కొనియాడారు. బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాలలైన వారికి వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం ఉంటుందని..ఆ మాటను సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పేర్కొన్నారు. అందుకు ఉదహరణగా ముదిరాజ్ నుంచి విడదల రజినీని, వడ్డెర నుంచి నన్ను చట్టసభల్లో పంపిణీ ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న ముదిరాజులందరి మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉంటుందని ముదిరాజ్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు గూడూరు నానిముదిరాజ్ పేర్కొన్నారు. 2014, 2019 ఎన్నికలు బేరీజు వేసుకుంటే ఏ రాజకీయ పార్టీ బీసీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చిందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు తాతబోయిన మల్లిఖార్జున, తూటుపల్లి లక్ష్మణ్, నాగరాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.




సుల్తానాబాద్‌లో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

# ఆంధ్రాప్యారిస్‌లో సంక్షేమాభివృద్ధి

## ప్రభుత్వ వైద్యశాలలకు కొత్త సొబగులు

- కొత్తగా 5 అర్బన్ హెల్త్ సెంటర్లు
- రూ.45 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్
- రూ.30 కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్

దేశంలోనే ఆంధ్రా ప్యారిస్‌గా పేరుపొందిన తెనాలిలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. ప్రజలకు అవసరమైన అన్నిరకాల మౌలిక సదుపాయాలతో పాటు విద్యా, వైద్యరంగాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ప్రజలకు ఇంటి ముంగిటకే పథకాలు చేరువయ్యాయి. విద్యారంగంలో నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త సొబగులు సమకూరాయి. అలాగే వైద్యరంగంలో కార్పొరేట్ వైద్య సేవలకు పేద ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. రూ.150 కోట్లకు పైగా అభివృద్ధి పనులు తెనాలిలో జరగడం విశేషం. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందడంతో వారు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

**తెనాలి:** ఆంధ్రా ప్యారిస్ తెనాలి సంక్షేమాభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. జిల్లా కేంద్రం గుంటూరు తర్వాత ఇక్కడి ప్రజలు గరిష్టంగా సంక్షేమ లబ్ధిని, ఇళ్లస్థలాలను అందుకోగలిగారు. పట్టణంలోని పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు, అగ్రవర్ణాల్లోని పేదలకు ప్రభుత్వం రూ.538.39 కోట్లను నేరుగా ఖాతాల్లో జమచేసింది. నాన్ డీబీటీ కింద (ఇళ్లస్థలాలు, విద్యాకానుక, ట్యాబ్‌లు, జగనన్న తోడు రుణాలు, గోరుముద్ద, సంపూర్ణ పోషణ, బియ్యం కార్డులు, కంటివెలుగు) 76,187 మందికి రూ.413.19 కోట్ల లబ్ధి చేకూరింది. పట్టణంలో రూ.150.98 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతలైన విద్య, వైద్యరంగాల్లో ఇక్కడ పెనుమార్పులు సంభవించాయి.

**కొత్తగా 5 అర్బన్ హెల్త్ సెంటర్లు**

జిల్లా ఆసుపత్రికి అదనంగా పట్టణంలోని సాలిపేటలో అర్బన్ హెల్త్ సెంటర్ నడుస్తోంది. అయిదారు వార్డులకో వైద్యకేంద్రాన్ని నెలకొల్పాలన్న భావనతో ప్రభుత్వం పట్టణంలో అదనంగా మరో అయిదు డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను మంజూరు చేసింది. వీటికి భవనాల నిర్మాణానికి ఒక్కోటి రూ.1.10 కోట్ల వంతున అయిదింటికి రూ.5.50 కోట్లను విడుదల చేసింది. పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ, సుల్తానాబాద్, నేలపాడురోడ్డు, ఆలపాటి నగర్‌లో అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం పూర్తయింది. ఒక్కో సెంటర్‌లో వైద్యాధికారితో సహా ఏడుగురు సిబ్బంది ఉన్నారు. ప్రతి సెంటర్లో 64 పరీక్షలకు తగిన లేబొరేటరీ, కుక్క, పాము కాటు ఇంజక్షన్లతో సహా 175 వరకు మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రతిచోట రోజుకు 60–70 మంది వైద్యసేవలను వినియోగించుకుంటున్నారు.

**చిన్నారుల కోసం 'డైక్' సెంటర్**

అప్పుడే పుట్టిన చిన్నారుల్లో మూగ, చెవుడు, మానసిక స్థితి సరిగా లేకపోవటం, కంటిచూపు మందగించడం, చర్మవ్యాధులు కనిపిస్తుంటాయి. వీటి చికిత్సల కోసం జిల్లా ఆసుపత్రి ఆవరణలో సత్వర చికిత్సా కేంద్రం (డైక్)ను నిర్మించారు. అప్పుడే పుట్టిన పసిబిడ్డల నుంచి 18 ఏళ్ల పిల్లల వరకు ఇక్కడ అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు చికిత్సలను అందిస్తున్నారు. కంటి, పంటి, వెన్నుపూస, కాళ్లు వంకర్లుకు అవసరమైన శస్త్రచికిత్సలను ఉచితంగా చేయిస్తున్నారు. అవసరమైన కళ్లజోళ్లు, వినికిడి మిషన్‌లు దాతల సహకారంతో పంపిణీ చేస్తున్నారు.

**రూ.45 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్**

తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో కొత్తగా రూ.45 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మిస్తున్నారు. దీనితో మరో 100 పడకల ఆసుపత్రి అందుబాటులోకి రానుంది. రోడ్డు ప్రమాదాలతో సహా అత్యవసర చికిత్సలకు బాధితులను గుంటూరుకు రిఫర్ చేయకుండా ఇక్కడే ట్రీట్‌మెంట్ ఇచ్చే వెసులుబాటు వస్తోంది. ఇక్క చిన్నారుల కోసం కొన్ని పడకలను కేటాయిస్తారు. దీనితో జిల్లా వైద్యశాలలో మొత్తం 400 పడకలు వచ్చినట్లవుతుంది.

**మారిన బడుల స్వరూపం**

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, రక్షిత మంచి నీటి ప్లాంట్ ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, మురుగునీటి వసతి ఏర్పాటు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, మరమ్మతులు పూర్తిచేశారు. ఇందు కోసం రూ.12.50 కోట్ల వ్యయం చేశారు.



రూ.45 కోట్ల వ్యయంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతన ఆక్సిజన్ ప్లాంట్

| పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలకు వ్యయం | రూ. కోట్లలో |
|---|---|
| 14వ ఆర్థికసంఘం గ్రాంటు | 16.19 |
| ఎస్సీ సబ్‌ప్లాన్ | 0.76 |
| ట్రైబల్ సబ్‌ప్లాన్ | 0.50 |
| అమృత్ పథకం | 30.06 |
| ముఖ్యమంత్రి అభివృద్ధి నిధి | 0.15 |
| మనబడి నాడు–నేడు | 12.50 |
| 15వ ఆర్థికసంఘం గ్రాంటు | 21.07 |
| డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్స్ | 4.49 |
| గడప గడపకు మన ప్రభుత్వం | 8.40 |
| ఎస్‌టీపీ | 39.56 |
| జగనన్న లే అవుట్ పనులు | 10.31 |
| జగనన్న హరిత నగరాలు | 0.58 |
| మున్సిపల్ సాధారణ నిధులు | 6.41 |
| | 150.98 |

## జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు కొత్త సొబగులు



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.1.25 కోట్లతో ఏర్పాటైన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీ

స్థానిక చెంచుపేటలో 250 పడకలు కలిగిన జిల్లా ప్రభుత్వ వైద్యశాల, అక్కడి ఆవరణలోని 100 పడకలు గల తల్లీ పిల్లల వైద్యశాలతో సహా కొత్తగా 370 ఆధునాతన పరికరాలను సమకూర్చారు. లేబర్ రూమ్‌లను ఆధునీకరించారు. ఆసుపత్రిలోని ఆక్సిజన్ ప్లాంటు సామర్థ్యాన్ని పెంచి, కొత్తగా మరో ప్లాంటును నిర్మించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.1.25 కోట్లలో రూ.45 లక్షలతో ప్రభుత్వ ఆసుపత్రిలోని ల్యాబ్‌ను ఆధునికరించారు. రూ.80 లక్షలతో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌గా తీర్చిదిద్దారు. హిమోగ్లోబిన్, టోటల్ కౌంట్, ఎంసీవీ, ఈసీఆర్, బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, సీరమ్ పొటాషియం, డెంగూ, యూరిన్ ప్రెగ్నెన్సీ టెస్ట్, మలేరియా, వీడీఆర్ఎల్, ఎఈసీ, టోటల్ కొలాస్ట్రాల్, టోటల్ ప్రొటీన్ వంటి 80 రకాల పరీక్షలను చేస్తున్నారు.